తిరుమల లడ్డూపై వివాదం

గతంలో తయారీకి జంతుకొవ్వును వాడారన్న బాబు

- చంద్రబాబు వ్యాఖ్యలు దుర్మార్గం
- కుటుంబంతో సహా ప్రమాణానికి సిద్ధం : సుబ్బారెడ్డి
- బాబును దేవుడు క్షమించడు: భూమన కరుణాకర్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం ఇప్పుడు దుమారం రేపుతున్నది. వైసీపీ హయాంలో లడ్డూ తయారీ కోసం జంతు కొవ్వు వినియోగించారని ఆ రాష్ట్ర సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు వివాదం రేపాయి. లడ్డూ కోసం ఉపయోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు ఉన్నట్టు నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ ఆఫ్ గుజరాత్ (ఎన్‌డీడీబీజీ) సీఏఎల్ఎఫ్ ల్యాబ్ కూడా నిర్ధారించింది. ఈ ఏడాది జూలైలో లడ్డూను ల్యాబ్‌కు పంపగా, అదే నెల 17న నివేదిక వచ్చింది. ల్యాబ్ రిపోర్ట్ ప్రకారం.. లడ్డూలో ఆవు నెయ్యి, సోయాబీన్, పొద్దు తిరుగుడు, ఆలివ్, గోధుమ బీన్, మక్క జొన్న, పత్తి గింజలతోపాటు చేప నూనె, జంతుకొవ్వు, పామాయిల్, పంది కొవ్వు కూడా వాడారు. ఆ రిపోర్టును గురువారం టీడీపీ అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి మీడియాకు విడుదల చేశారు.



చంద్రబాబు వ్యాఖ్యలతో దుమారం

తిరుమల లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు వినియోగించారని స్వయంగా చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. శ్రీవారి ప్రసాదాన్ని సెంటిమెంట్‌గా భావించే భక్తులకు తాజా పరిణామాలు కలవరపెడుతున్నాయి. సీఎం వ్యాఖ్యలను టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఖండించారు. తిరుమల పవిత్రతను, వందల కోట్లమంది హిందువుల విశ్వాసాలను చంద్రబాబు దారుణంగా దెబ్బతీసి పెద్ద పాపం చేశారని విమర్శించారు. తిరుమల ప్రసాదం విషయంలో నేను, నా కుటుంబం ఆ దేవదేవుని సాక్షిగా ప్రమాణానికి సిద్ధంగా ఉన్నాం. చంద్రబాబు తన కుటుంబంతో ప్రమాణానికి సిద్ధమా?' అంటూ సవాల్ విసిరారు.

సీబీఐ విచారణ జరిపించాలి: షర్మిల

చంద్రబాబు కామెంట్స్‌పై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల స్పందించారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా టీడీపీ, వైసీపీ నీచ రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. సీఎం హోదాలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు తిరుమల పవిత్రత, ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ఘటనలో అసలేం జరిగిందో తెలుసుకునేందుకు సీబీఐ విచారణ జరిపించాలని, ఆ మహాపాపానికి, అపచారానికి కారకులెవరో తేల్చాలని డిమాండ్ చేశారు.

నిత్యం 300-500 లీటర్ల నెయ్యి వాడకం

తిరుమల లడ్డూ తయారీకి వాడే నెయ్యిని టీటీడీ మార్కెటింగ్ విభాగం కొనుగోలు చేస్తుంది. ప్రతి ఆరు నెలలకొకసారి టెండర్లు పిలిచి ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా నెయ్యిని సమకూర్చుకుంటుంది. నిత్యం 300-500 లీటర్ల నెయ్యి వినియోగిస్తారు. నెయ్యి నాణ్యతను పరీక్షించేందుకు ల్యాబ్ కూడా తిరుమలలోనే ఉన్నది. ఇన్ని అంచెలు దాటి కల్తీ నెయ్యి, అది కూడా జంతువుల కొవ్వు నుంచి తీసింది వాడటం అనే టాపిక్ భక్తులను ఆందోళనకు గురిచేస్తున్నది. 2021 మార్చి వరకు నందిని బ్రాండ్ (కర్ణాటక) నెయ్యి సరఫరా అయ్యేది. తక్కువ ధరకి సరఫరా చేయలేమంటూ నందిని తప్పుకున్నది. ఆ తర్వాత యూపీకి చెందిన ప్రీమియర్ ఎల్-1గా, ఎల్-2గా అల్ఫా కంపెనీలు నెయ్యి సరఫరా చేసేందుకు అర్హత పొందాయి. కేజీ నెయ్యి రూ.424 ప్రకారం టీటీడీకి సరఫరా చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నాయి.

భగవంతుడు క్షమించడు: భూమన కరుణాకర్‌రెడ్డి

తిరుమల ప్రసాదాలపై చంద్రబాబు ఆరోపణలు అత్యంత దుర్మార్గమని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. రాజకీయ లబ్ధికోసం, రాజకీయ స్వార్థం కోసం భగవంతుడిని వాడుకుంటే.. అలాంటి ఆరోపణలు చేసినవారిని భగవంతుడు క్షమించబోడని గురువారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. శ్రీ వేంకటేశ్వరస్వామి దుష్టశిక్షణ చేస్తాడని స్వయంగా చంద్రబాబే పలుమార్లు చెప్పారని, ఇలాంటి నీచమైన ఆరోపణలు చేసిన వ్యక్తిని భగవంతుడు చూస్తూ ఊరుకోడని తెలిపారు. రాజకీయ ప్రత్యర్థులను దృష్టిలో ఉంచుకుని భగవంతుడి పేరు మీద ఆరోపణలు చేయడం చంద్రబాబుకు కొత్తేమీ కాదని, గతంలో వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు కూడా చంద్రబాబు ఇలాంటి ఆరోపణలు చేశారని గుర్తుచేశారు. దీనికి అప్పుడు భగవంతుడు శిక్ష కూడా విధించాడని, అయినా చంద్రబాబు మారలేదని మండిపడ్డారు.

ఎన్ఈఎస్‌టీఎస్ స్టీరింగ్ కమిటీ సభ్యుడిగా శరత్

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్ ట్రైబల్ స్టూడెంట్స్(ఎస్ఈఎస్‌టీఎస్)స్టీరింగ్ కమిటీ సభ్యుడిగా రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఏ శరత్‌ను నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆయన ఏడాది పాటు పదవిలో కొనసాగనున్నారు.

నేటి నుంచి ఐసెట్ తుది విడుత కౌన్సెలింగ్

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): టీజీఐసెట్-2024 తుది విడుత కౌన్సెలింగ్ శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నది. ఈ మేరకు ఉన్నత విద్యాకమిషనర్, టీజీఐసెట్ అడ్మిషన్ల కన్వీనర్ గురువారం షెడ్యూల్ ప్రకటించారు. ఈ నెల 20, 21 తేదీల్లో రిజిస్ట్రేషన్‌తోపాటు ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తిచేసుకోవాలని అధికారులు తెలిపారు. 21, 22 తేదీల్లో వెబ్ ఆప్షన్లను ఎంచుకొని, 22వ తేదీన ఫ్రీజింగ్ చేసుకోవాలి. 25వ తేదీలోపు సీట్లను కేటాయిస్తామని, 25, 27 తేదీల్లో నిర్ణీత ఫీజును చెల్లించి 25 నుంచి 28 తేదీల్లో కాలేజీల్లో రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు. 27న స్పాట్ అడ్మిషన్లకు సంబంధించి మార్గదర్శకాలు విడుదలకానున్నాయి. ఇటీవలే ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్ ముగియగా, మిగిలిన 4,448 సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

బీ ఫార్మసీ ప్రవేశాలకు కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కళాశాలల్లో 2024-25 విద్యాసంవత్సరానికి బీ ఫార్మసీ, ఫార్మ డీ కోర్సుల్లో ప్రవేశాల కౌన్సెలింగ్‌కు టీజీఈఏపీ సెట్-2024 ప్రవేశాల కన్వీనర్, సాంకేతిక విద్యాకమిషనర్ శ్రీదేవసేన గురువారం షెడ్యూల్‌ను ప్రకటించారు. ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌లో భాగంగా ఇప్పటికే సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తయిన అభ్యర్థులు ఈ నెల 24, 25 తేదీల్లో వెబ్ ఆప్షన్లు ఎంచుకోవచ్చు. 27వ తేదీలోపు సీట్ల తాత్కాలిక కేటాయింపు ఉండగా, 27 నుంచి 28 వరకు ట్యూషన్ ఫీజు చెల్లింపుతోపాటు వెబ్‌సైట్ ద్వారా రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. 28, 29 తేదీల్లో సీట్లు పొందిన విద్యార్థులు కళాశాలకు వెళ్లి జాయినింగ్ రిపోర్టు ఇవ్వాలి. 30న ఆయా కాలేజీలు విద్యార్థుల జాబితాను ప్రకటిస్తాయి. వివరాలకు https:// tgeap cetb.nic.in ను చూడాలని కన్వీనర్ సూచించారు.

సంతూర్ స్కాలర్‌షిప్‌నకు 30 వరకు దరఖాస్తులు

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): గ్రామీణ ప్రాంతాల్లోని బాలికలను ఉన్నత చదువుల వైపు ప్రోత్సహించేందుకు రూ.24 వేల వార్షిక స్కాలర్‌షిప్‌ను విప్రో సంస్థ ప్రకటించింది. ప్రభుత్వ స్కూళ్లు/కాలేజీల్లో 2024-25 విద్యాసంవత్సరంలో డిగ్రీలో చేరినవారికి ఈ స్కాలర్‌షిప్ అందజేస్తామని సంస్థ ప్రతినిధి నీరజ్ కత్రి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థినులు ఈ నెల 30 వరకు www. santoorschlorship.com వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విద్యార్థినులను కరిచిన ఎలుకలు

సిరిసిల్ల రూరల్, సెప్టెంబర్ 19: రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం నేరెళ్లలోని బాలికల గురుకుల పాఠశాలలో పలువురి విద్యార్థులను ఎలుకలు కరిచాయి. ఈ నెల 5న రాత్రి వేళ 14 మందిని ఎలుకలు కరిచాయి. ఈ నెల 6న నేరెళ్ల పీహెచ్‌సీలో వైద్యం చేయించారు. ఈ నెల 9న రాత్రి 25 మందిని మళ్లీ ఎలుకలు కరువడంతో 10న అదే పీహెచ్‌సీలో వైద్యం చేయించారు. ఈ విషయంపై పీహెచ్‌సీ వైద్యాధికారి రేఖను వివరణ కోరగా 39 మందికి వైద్యం చేసినట్టు ధ్రువీకరించారు. ప్రిన్సిపాల్ రాధను ఫోన్‌లో సంప్రదించగా, అందుబాటులోకి రాలేదు.

ఫ్రీ పవర్ ఎఫెక్ట్..త్వరలో కరెంట్ షాక్!

- విద్యుత్తు వినియోగదారులపై 1200 కోట్ల భారం!
- ఎల్‌టీ క్యాటగిరీలో రూ.10 నుంచి రూ.50 వరకు ఫిక్స్‌డ్ చార్జీల పెంపు
- హెచ్‌టీ క్యాటగిరీలో ఫిక్స్‌డ్ చార్జీలతోపాటు బిల్లుల పెంపు
- కుటీర పరిశ్రమలు, పంచాయతీలు, బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లపై భారం
- టీజీఎస్ఈఆర్సీకి డిస్కంల ప్రతిపాదనలు

హైదరాబాద్ సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): తెల్ల రేషన్‌కార్డు కలిగిన 200 యూనిట్లలోపు గృహ వినియోగదారులకు ఉచిత విద్యుత్తు ఇవ్వడం వల్ల పడుతున్న భారాన్ని ఇతర క్యాటగిరీల వినియోగదారుల మీద మోపేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నదా? నూతన సంవత్సర కానుకగా విద్యుత్తు చార్జీల పెంపుదల తప్పదా? డిస్కంలు బుధవారం రాత్రి విద్యుత్తు నియంత్రణ మండలి (ఈఆర్సీ)కి సమర్పించిన ప్రతిపాదనలు చూస్తే ఈ అనుమానమే కలుగుతున్నది. గృహజ్యోతి ద్వారా కోల్పోతున్న ఆదాయాన్ని రాబట్టుకునేందుకు బిల్లుల పెంపునకు అనుమతించాలనేది డిస్కంల ప్రతిపాదనల సారాంశం. రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు వినియోగించే గృహ వినియోగదారులకు ఉచిత విద్యుత్తు అందజేస్తున్నది. అయితే, ప్రభుత్వం ఈ సబ్సిడీని డిస్కంలకు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నది. దీంతో డిస్కంలు భారీగా ఆదాయం కోల్పోతున్నాయి. ఈ నేపథ్యంలో కోల్పోయిన ఆదాయాన్ని రాబట్టుకోవాలంటే చార్జీల పెంపే శరణ్యమని డిస్కంలు భావిస్తున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.1,200 కోట్ల మేర చార్జీలు పెంచేందుకు అనుమతించాలంటూ ఎన్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ ఇప్పటికే విద్యుత్తు నియంత్రణ మండలి (ఈఆర్సీ)కి ప్రతిపాదనలు సమర్పించాయి.

డిస్కంల ప్రతిపాదనలు

ఎల్‌టీ (లోటెన్షన్) క్యాటగిరీలోని 300 యూనిట్లకుపైగా కరెంటు వాడుతున్నవారికి ఫిక్స్‌డ్ చార్జీల కింద ప్రస్తుతం ప్రతి కిలోవాట్‌కు రూ.10 వసూలు చేస్తున్నారు. ఈ మొత్తాన్ని రూ.50కి పెంచాలని డిస్కంలు ప్రతిపాదించాయి. దీంతో ప్రస్తుతం రూ.30 వరకు విధిస్తున్న ఫిక్స్‌డ్ చార్జీలు రూ.150కి పెరగనున్నాయి. ఈ లెక్కన 300 యూనిట్లకుపైగా కరెంట్ వినియోగిస్తున్న సుమారు 26 లక్షల మందిపై దాదాపు ఐదు రెట్ల భారం పడనున్నది. డిస్కంల ప్రతిపాదనలకు ఆమోదం లభిస్తే.. హెచ్‌టీ (హైటెన్షన్) క్యాటగిరీలోని వినియోగదారులకు ఫిక్స్‌డ్ చార్జీలతోపాటు కరెంట్ బిల్లులు సైతం భారీగా పెరగనున్నాయి.

బహిరంగ విచారణ తర్వాతే అనుమతి

డిస్కంల ప్రతిపాదనలపై ఈఆర్సీ రాష్ట్రంలోని మూడు చోట్ల ప్రజల సమక్షంలో విచారణ చేపడుతుంది. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తుది తీర్పును వెల్లడిస్తుంది. తదనంతరమే చార్జీల పెంపునకు అనుమతిస్తుంది. ఈ ప్రక్రియ మొత్తం పూర్తికావాలంటే దాదాపు మూడు నెలల సమయం పడుతుందని సంబంధిత అధికారులు తెలిపారు. డిస్కంల ప్రతిపాదనలకు ఈఆర్సీ ఆమోదం లభిస్తే, వచ్చే కొత్త సంవత్సరం (జనవరి) నాటికి కరెంట్ చార్జీలు పెరిగే అవకాశాలున్నట్టు భావిస్తున్నారు.

అన్ని సబ్ క్యాటగిరీలకు ఒకే చార్జీ

-ప్రస్తుతం 11 కేవీ, 33 కేవీ, 132 కేవీ/ఆపై కెపాసిటీ కనెక్షన్లు ఉన్నాయి. ఈ విభాగంలో మూడు సబ్ క్యాటగిరీలకు వేర్వేరుగా చార్జీలు విధిస్తున్నారు. 11 కేవీ కింద కనెక్షన్ తీసుకున్న వినియోగదారులకు యూనిట్‌కు రూ.7.65 చొప్పున, 33 కేవీ కనెక్షన్‌దారులకు రూ.7.15, 132/ఆపై క్యాటగిరీలోని వారికి రూ.6.65 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇక మీదట అన్ని క్యాటగిరీలకు 11 కేవీలోని వినియోగదారులకు మాదిరిగా రూ.7.65 చొప్పున వసూలు చేసేందుకు అనుమతివ్వాలని డిస్కంలు కోరుతున్నాయి. అంటే 33 కేవీ వినియోగదారులకు యూనిట్‌కు 50 పైసలు, 132 కేవీ వారికి రూపాయి చొప్పున చార్జీలు పెరగనున్నాయి.

- ఈ విధంగా కరెంట్ బిల్లుల పెంపుతో రూ.700 కోట్లు, ఫిక్స్‌డ్ చార్జీల ద్వారా రూ.100 కోట్లు మొత్తంగా రూ.800 కోట్లు రాబట్టుకునే అవకాశం ఇవ్వాలని డిస్కంలు ప్రతిపాదించాయి. దీంతోపాటు ఎల్‌టీ వినియోగదారుల నుంచి ఫిక్స్‌డ్ చార్జీల రూపేణా రూ.400 కోట్ల ఆదాయం పెంపునకు ప్రతిపాదించాయి. దీంతో గృహ, గృహేతర/వాణిజ్య, సాధారణ, కుటీర పరిశ్రమలు, స్ట్రీట్‌లైట్లు, రక్షిత తాగునీటి పథకాల నిర్వహణపై ఫిక్స్‌డ్ చార్జీల భారం పడనున్నది.
- కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో డిస్కంలకు రూ.14,222 కోట్లు ఆదాయలోటు ఉన్నదని అధికారులు వెల్లడించారు. ఇందులో చార్జీల పెంపుతో రూ.1,200 కోట్లు సమకూరితే, మిగిలిన రూ.13,022 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ రూపంలో అందించాలని నివేదించాయి.

బండి కొన్న వెంటనే శాశ్వత రిజిస్ట్రేషన్!

- 'వాహన్ సారథి' వచ్చేస్తున్నది
- రవాణా సేవలన్నింటికీ ఏకీకృత విధానం
- 'వాహన్'లో వాహనాల వివరాలు, ఆర్సీలు
- నెలాఖరు నుంచి సికింద్రాబాద్ ఆర్టీఏలో ప్రారంభం
- దశల వారీగా అన్ని ఆర్టీఏల్లో విస్తరణ

> దేశవ్యాప్తంగా రవాణా సేవలన్నింటికీ ఏకీకృత విధానాన్ని అమలుచేసేందుకు ప్రవేశపెట్టిన 'వాహన్ సారథి'ని తెలంగాణలో ప్రయోగాత్మకంగా అమలుచేసేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. దీంతో రవాణాశాఖ అందించే పౌరసేవలు మరింత పారదర్శకం కానున్నాయి.

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): ఇకపై వాహనం కొన్న వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తికానున్నది. లెర్నింగ్ లైసెన్సుల కోసం ఆర్టీఏ కార్యాలయాలనికి వెళ్లాల్సిన అవసరం లేదు. డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్, వాహనాల నమోదు, బదిలీ తదితర సేవలు వినియోగదారులకు మరింత చేరువకానున్నాయి. ప్రస్తుతం టీ-యాప్, ఫోలియో వంటి మొబైల్ యాప్‌ల ద్వారా ప్రత్యక్ష సేవలను పొందేందుకు అవకాశం ఉండగా, త్వరలో 'వాహన్ సారథి' అందుబాటులోకి రానున్నది.

ఆన్‌లైన్‌లోనే లెర్నింగ్ పరీక్షలు..

లెర్నింగ్ లైసెన్స్‌ల పరీక్షలను కూడా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెచ్చే అవకాశం ఉన్నది. కర్ణాటకలో ఈ తరహా పద్ధతి విజయవంతంగా అమలవుతుండటంతో హైదరాబాద్‌లోనూ ఆన్‌లైన్ టెస్టింగ్ విధానాన్ని అమలు చేయాలని రవాణా అధికారులు యోచిస్తున్నారు. దీంతో వినియోగదారులు ఆర్టీఏ కార్యాలయాలకు వెళ్లకుండా ఇంటి నుంచే ఎల్ఎల్ఆర్ (లెర్నింగ్ లైసెన్స్) పొందవచ్చు. శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్ కోసం మాత్రం టెస్ట్ ట్రాక్‌లో ప్రత్యక్ష పరీక్షలకు హాజరుకావాలి.

సారథిలో లైసెన్స్‌ల డాటా..

సికింద్రాబాద్ ఆర్టీఏ కార్యాలయం నుంచి త్వరలోనే 'సారథి' సేవలు ప్రయోగాత్మకంగా ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్ కేంద్రంగా 'సారథి' కార్యకలాపాలు సాగిస్తున్నది. దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన డ్రైవింగ్ లైసెన్స్‌ల వివరాలు సారథిలో నమోదు కాగా, ఇటీవల మన రాష్ట్రం కూడా ఈ జాబితాలో చేరింది. దీంతో కొత్తగా డ్రైవింగ్ లైసెన్స్‌లు తీసుకొనే అభ్యర్థులు మినహాయించి పాతవి రెన్యువల్ చేసుకోవడం, చిరునామా బదిలీ చేసుకోవడం వంటి సేవలను సారథి ద్వారా పొందే వీలున్నది. లైసెన్స్‌ల మొత్తం డాటా సారథిలో నిక్షిప్తమై ఉంటుంది.

వాహనాల నమోదుకు 'వాహన్'

దేశంలోని మెజారిటీ రాష్ట్రాలు వాహనాల వివరాలను 'వాహన్'లో నమోదు చేశాయి. ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న 'వాహన్'లో ఇటీవల తెలంగాణ కూడా చేరేందుకు చర్యలు చేపట్టింది. దీంతో వాహనం కొనుగోలు చేసిన వెంటనే షోరూమ్‌లోనే శాశ్వత రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. ప్రస్తుతం ఆటోమొబైల్ డీలర్లు తాత్కాలిక రిజిస్ట్రేషన్ పత్రాలను(టీఆర్) ఇస్తున్నారు. అనంతరం ఆర్టీఏ అధికారులు శాశ్వత రిజిస్ట్రేషన్ (ఆర్‌సీ) చేస్తున్నారు. ఇకపై వాహనాన్ని ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి బదిలీ చేసేందుకు ఎన్‌వోసీ అవసరం లేకుండా 'వాహన్'లో ధ్రువీకరించుకొని బదిలీ చేయవచ్చు. ప్రమాద బీమా సదుపాయం కూడా తేలిగ్గా లభిస్తుంది.

జేఎన్ఎఫ్ఏయూకు భూమి కేటాయించొద్దు

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలోని పదెకరాలను జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి కేటాయించొద్దంటూ నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్‌వీయూ ఉద్యోగులు

అల్లుడా మజాకా

మొదటిపేజీ తరువాయి...

ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

150 ఎకరాలు నీట మునక!

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తొర్రూరులో ఎర్రకుంటలోని నీరు దిగువకు వెళ్లేలా తొర్రూరు-బ్రాహ్మణపల్లి రహదారిని ఆనుకుని ప్రస్తుతం అలుగు నిర్మాణం చేపడుతున్నారు. నీటిపారుదల శాఖ ప్రతిపాదించిన మేరకు ఆర్‌అండ్‌బీ శాఖ పనులు చేపడుతున్నది. సుమారు రూ.20 లక్షలతో చేపట్టిన ఈ పనులకు సంబంధించిన అంచనాలకు ఈ ఏడాది ఫిబ్రవరిలో మంజూరు కల్పించగా పనులు దక్కించుకున్న సంస్థ ఆగస్టులో ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిసింది. ఇటీవలే పనులు మొదలు కాగా ఒప్పందం ప్రకారం 1000 ఎంఎం డయా సామర్థ్యం గల పైపులైన్ వేయాల్సి ఉన్నది. కానీ, స్థానిక రైతులు నిరసన తెలుపడంతో పైపులైన్ బదులు అలుగు నిర్మాణం చేపట్టాలని నిర్ణయించినట్టు తెలిసింది. కుంటకు గతంలో ఉన్న అలుగు ప్రాంతంలో కొత్తది నిర్మించకుండా వేరే ప్రాంతంలో చేపట్టడమే వివాదానికి కారణమైంది. ప్రస్తుతం నిర్మిస్తున్న అలుగుతో కుంటలోకి వరద కారణంగా 150 ఎకరాలు నీట మునుగుతాయని బాధిత రైతులు పేర్కొంటున్నారు. పనులు ఆపేయాలని కోరుతూ అలుగు నిర్మాణ ప్రాంతం వద్దనే టెంట్ వేసుకొని ఆరు రోజులుగా తమ కుటుంబాలతో నిరసన తెలుపుతున్నా పోలీసు బందోబస్తుతో చేయిస్తున్నారని వాపోయారు.

వారి భూముల ముంపు తప్పించేందుకేనా?

ఎర్రకుంటకు ఎగువన వ్యవసాయ భూములు చాలావరకు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయి. ఎఫ్‌టీఎల్ పరిధి తగ్గించి ఆయా భూములకు ముంపు ముప్పు తప్పించేందుకే కొత్తచోట అలుగు నిర్మిస్తున్నారని రైతులు విమర్శిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే అల్లుళ్లకు సంబంధించిన పొలాలు ఉన్నాయని, భవిష్యత్తులో ఆ భూముల్లో విల్లాలు నిర్మించే ఆలోచనలో సదరు వ్యక్తులు ఉన్నారని చెప్పున్నారు. అలుగు నిర్మాణం పూర్తయితే తమ పొలాలు మునుగుతాయని, ఇక చావే శరణ్యమని ఆవేదన చెందుతున్నారు. నిరసన తెలుపుతున్న తమకు ఎమ్మెల్యే అల్లుళ్ల నుంచి ప్రాణహాని ఉన్నదని బాధిత రైతుల్లో ఒకరైన రాజ్ కిరణ్ మీడియా ఎదుట ఆందోళన వ్యక్తంచేశారు. కాగా రైతుల వాదనను ఎమ్మెల్యే అల్లుడు నరేందర్‌రెడ్డి విభేదించారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. అలుగు వివాదంపై వివరణ కోసం నీటిపారుదల శాఖ అధికారులకు ఫోన్‌చేయగా స్పందించ లేదు. ఈ వివాదంపై హైడ్రా కమిషనర్‌కు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు బాధిత రైతులు చెప్పారు.

ముత్తన్న, రాయమల్లు (ఫైల్)

విద్యుత్ కంచెలే.. మృత్యుపాశాలై..

వేర్వేరు చోట్ల ఇద్దరు రైతుల మృతి

మల్లాపూర్, సెప్టెంబర్ 19: పంటల రక్షణ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెలకు తగిలి ఇద్దరు రైతులు ప్రాణాలు కోల్పోయారు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం కుస్తాపూర్ గ్రామానికి చెందిన జెల్ల పెద్ద ముత్తన్న (60) పొలంలో మందు చల్లేందుకు వెళ్లారు. పక్కనే రత్నాపూర్ గ్రామానికి చెందిన గొండ సాయన్న తన మక్క చేనును కోతుల బెడద నుంచి కాపాడుకునేందుకు ఇనుప కంచె ఏర్పాటు చేసి, మోటారు నుంచి అక్రమంగా కరెంట్ పెట్టాడు. పెద్ద ముత్తన్న ప్రమాదవశాత్తూ ఇనుప కంచెకు తాకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ముత్తన్న భార్య జెల్ల పెద్దరాజు ఫిర్యాదు మేరకు సాయన్నపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం పత్తిపాకకు చెందిన రైతు దయ్యాల రాయమల్లు (56) పొలానికి నీళ్లు పెట్టేందుకు ఉదయం వెళ్లాడు. పక్క పొలానికి చెందిన రైతు కర్నె రాములు ఇనుప వైర్‌తో కంచెను ఏర్పాటు చేసి, కరెంట్ కనెక్షన్ ఇచ్చాడు. రాయమల్లు ఆ తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జానీమాస్టర్ అరెస్ట్

- గోవాలో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- నేడు రాజేంద్రనగర్ కోర్టులో హాజరుపర్చనున్నట్టు వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): మహిళా డ్యాన్సర్‌పై లైంగికదాడికి పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న కొరియోగ్రాఫర్ జానీమాస్టర్‌ను ఎట్టకేలకు పోలీసులు గోవాలో అరెస్టు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వివరాలు సేకరించిన పోలీసులు జానీపై పోక్సో, లైంగికదాడి కేసులు నమోదు చేసిన విషయం తెల్సిందే. పరారీలో ఉన్న జానీమాస్టర్ గోవాలో ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. గురువారం జానీ మాస్టర్‌ను అరెస్టు చేసి, గోవా కోర్టులో హాజరుపరిచారు. శుక్రవారం ఉప్పర్‌పల్లిలోని రాజేంద్రనగర్ కోర్టులో హాజరుపర్చనున్నట్టు డీసీపీ తెలిపారు.

2 నుంచి దసరా సెలవులు

- అక్టోబర్ 14 వరకు వరుసగా 13 రోజులు తాతిల్
- మళ్లీ అక్టోబర్ 15న పాఠశాలల పునఃప్రారంభం

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని పాఠశాల విద్యార్థులకు గుడ్ న్యూస్. వరుసగా 13 రోజులు సెలవులు రాబోతున్నాయి. అక్టోబర్ 2 నుంచి 14వ తేదీ వరకు బడులకు దసరా సెలవులు ప్రకటించారు. గాంధీ జయంతి మొదలు.. బతుకమ్మ, దసరా పండుగ వరకు పాఠశాలలకు సెలవులు ఇచ్చారు. కొన్ని ప్రైవేటు స్కూళ్లకు 14 రోజులు సెలవులు ఇవ్వనున్నారు. అక్టోబర్ 15న పాఠశాలలు తిరిగి ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించిన క్యాలెండర్‌ను మే 25న విడుదల చేసింది. అక్టోబర్ 2 నుంచి 14 వరకు దసరా సెలవులు, డిసెంబర్ 23 నుంచి 27 వరకు క్రిస్మస్ సెలవులు, జనవరి 13 నుంచి 17 వరకు సంక్రాంతి సెలవులను ప్రకటించింది. క్యాలెండర్ ప్రకారం.. 2025 ఏప్రిల్ 23 వరకు పాఠశాలలు కొనసాగనున్నాయి. 2025 ఫిబ్రవరి 28లోపు టెన్త్ ప్రీఫైనల్, మార్చిలో వార్షిక పరీక్షలు నిర్వహిస్తారు.

ఎట్టకేలకు జీతాలు విడుదల

- గురుకుల రెగ్యులర్ ఉద్యోగుల వేతనాల చెల్లింపు
- ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి మళ్లీ మొండిచెయ్యే..

హైదరాబాద్, సెప్టెంబర్19 (నమస్తే తెలంగాణ): గురుకులాల్లోని బోధన, బోధనేతర సిబ్బందికి ఎట్టకేలకు జీతాలు పడ్డాయి. గురువారం మధ్యాహ్నం నుంచి వేతనాలను వారి ఖాతాల్లో జమ చేశారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, మై